# 4. వేపచెట్టు

'నెలకి నెలా జొరంపీక్కు దినేసింది!' అన్నాడు ముసలయ్య.అలా అతడు, ఎండిపోయిన నాలికిని తడిచేసుగుంటూ అన్నాడు. పీక్కుపోయి, లోతుకి పోయిన కళ్లతో, బుచ్చినాయుడి మొహంలోకి చూస్తూ అన్నాడు.

బుచ్చినాయుడు,ముసలయ్య మొహంలోకి చూసాడు. అతడి లోతుకుపోయిన కళ్లు చూసాడు. ఎండిపోయిన జుత్తు చూసాడు. బరువెక్కి,వాలిపోతున్న కనురెప్పలు చూసాడు. లోతుకుపోయిన పొట్టను చూసాడు. జారి వేలాడుతున్న కండల్ని చూసాడు. ముడతలు పడ్డ చర్మాన్ని చూసాడు. అలా అతడు ఏభయి ఏళ్లు దాటిన ముసలయ్యను చూసాడు.

అలా చూసి చూసి అక్కణ్నుంచి వెళ్లిపోయాడు. అతడేమీ మాట్లాడలేదు.

ముసలయ్య, బుచ్చినాయుడి మొహంలోకి చూసాడు. అతడి కళ్లల్లో కోపాన్ని చూసాడు. అతడి మౌనంలో మంటల్ని చూసాడు. అతడి నడకల్లో నిప్పుల్ని చూసాడు.

అయినా-ముసలయ్యకు ఏమీ అర్థం కాలేదు.

ఆలోచిస్తూ ఆలోచిస్తూ, మెల్ల మెల్లగా పొలంలోకి నడిచాడు. ఆ పొలం ఆ వూరికి అరమైలు దూరంలో వుంది. వూట గెడ్డకి అవతల వైపున వుంది. ఆ గెడ్డ దాటగానే, ఖాళీ స్థలం వుంది. ఆ స్తలంలో పశువులకి వాసపాక వుంది. అలాగే రెండు గదుల పెంకుటిల్లు వుంది. పశువులపాక దగ్గర పెద్ద బావి వుంది. అక్కడే వయసు మళ్లిన వేపచెట్టు వుంది.

ముసలయ్య పొలంలోకి వెళ్లాడు. పశువులకి నీళ్లు పెట్టాడు. గడ్డి వేసాడు. చిన్న పాలికాపుల్తో కొంత సేపు కబుర్లు చెప్పాడు. ఆ తర్వాత, వేపచెట్టు కింద నులక మంచం వాల్చాడు. అప్పుడు ఆ మంచం మీద నడుం వాల్చాడు.

వెన్నెల వున్నా, చల్లదనం మాత్రం లేదు. కళ్లు మూసుకున్నా ముసలయ్యకు నిద్ర రాలేదు. అంచాత మళ్లీ లేచి కూర్చున్నాడు. చుట్ట ముట్టించాడు. వేపచెట్టు కొమ్మలు, సన్నని గాలిలో నెమ్మదిగా వూగుతున్నాయ్. ఆ వెన్నెట్లో, అవి నేలమీద అందమయిన నీడ బొమ్మల్ని

గీస్తున్నాయ్.

అయితే-మునలయ్య మాత్రం అవేవీ చూడ్లేదు. ఆలోచిస్తూ ఆలోచిస్తూ, అలా మళ్లీ నడుం వాల్చి నిద్రపోయాడు.

బుచ్చివాయుడు ఒకప్పుడు బుచ్చయ్యే. అతడ్నే బొచ్చు బుచ్చయ్యని అందరూ పిల్చే వాళ్లు. కాణీ కోసం ఖూనీలు చేసిన ఖూనీల కొండయ్య కొడుకే,బొచ్చు బుచ్చయ్య.

బొచ్చు బుచ్చయ్య ఒకప్పుడు ఆస్తిపరుడు కాడు. పది ఎకరాల పోరంబోకు భూమి వుండేది. ఆ భూవంతా-గులకరాళ్లూ-ఇసకతో నిండి వుండేది. ఏవీ పండకుండా, ఎంత పెట్టినా తింటూ వుండేది. బుచ్చయ్య ఆ భూమితో విసుగెత్తిపోయాడు. అమ్మేద్దావని అనుకున్నాడు.

అంతలో ఇరవై ఏళ్ల మునలయ్య, ముప్పయి ఏళ్ల బుచ్చయ్యకు పాలేరుగా కుదిరాడు.

'బూవిని అమ్మకండి! ఇదెందుకు పండదో నాను జూస్తాను! ఆ పని నాకు ఒగ్గియండి! ఈ బూవి బంగారం పండుద్ది!' అని మునలయ్య, బుచ్చయ్యకు ధైర్యం చెప్పాడు.

ఆ బూవిలో అడుగులోతు వరకూ వున్న పై మట్టిని పైకితోలించాడు. అలాగే ఇసకను కూడా తోలించాడు. ఆ తర్వాత లోతుగా దున్నాడు. అప్పుడా బూవిని చెరువు మట్టితో నింపాడు. ఆ చెరువు బాగు చేయించాడు. వూట గెడ్డ పాయను, ఆచెర్లోకి మళ్లించాడు. ఆచెర్లో నీటిని, ఆబూవికి మళ్లించాడు. ఎరువులు వేసాడు. గెత్తంతో నింపాడు.

రెండు సంవత్సరాల్లో ఆబూవి బాగా పండడం మొదలెట్టింది. ఆ తర్వాత, బంగారం పండుతోంది.

పంటలు బాగా పండుతున్నాయ్. ఆ పంటల వల్ల బుచ్చయ్యకు, డబ్బు పండుతోంది. ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం మొదలెట్టాడు. ఆ వడ్డీల్తో చిన్న రైతుల దగ్గర నుంచి దినుసులు కొంటున్నాడు. ఆ దినుసులతో వ్యాపారం చేస్తున్నాడు.

అలా అలా డబ్బుపెరుగుతూ,పెరుగుతూ అతడు చాలా ఆస్తిపరుడయ్యాడు. ఆ తర్వాత అతడు బుచ్చినాయుడయ్యాడు.

ఆ తర్వాత అతడు ఏమయినా కాగలడని కొందరంటూ వుండేవాళ్లు!

బుచ్చినాయుడు, మునలయ్యను, తమ్ముళ్లా పిల్చేవాడు. తమ్ముడికంటే ఎక్కువగా చూసేవాడు. ప్రతి పండక్కి రెండు పంచెల చాపులు తెచ్చేవాడు. 'ఒరేయ్! సిన్నోడా! నీకొకటీ-నాకొకటీరా!' అని ఓ పంచెల చాపు ఇస్తూ వుండేవాడు.

'నానియ్యాల ఇలా డబ్బుతో పెరిగి పో నానంటే, దానికి మూలం మునలయ్యేగానీ నాను గాదు! అలగని నాను నానెత్తి మీద సెయ్యేసి సెప్పగల్ను! నా పెళ్లాం పుస్తిల మీద ఒట్టేసి, ఇది అచ్చరాలా నిజం అని రాసి ఇచ్చీగల్ను!' అని సదరు బుచ్చినాయుడు, మునలయ్య ముందే

గాకుండా, అందరితోనూ గూడా చెప్తూ వుండేవాడు.

బుచ్చినాయుడు కాలాన్ని వైభవంగా, విలాసంగా గడుపుతున్నాడు. అయితే-కాలం కొన్ని కష్టాల్ని కలిగించడమే గాకుండా, బుచ్చి నాయుణ్ణి కలవరపెడ్తోంది.

'తిండానికి కూడునేకపోయినా, తాగడానికి మాకు గెంజినీల్లయినా ఒద్దా ?' అని కుర్ర పాల్లేర్లూ - అలాగే పనివాళ్లూ అడుగుతున్నారు. అడగడవేగాకుండా, అప్పుడప్పుడు పనులు గూడా మానేస్తున్నారు. అంచాత, అలా అలా కొన్ని చిక్కులు వచ్చి, బుచ్చి నాయుణ్ణి చీకాకుపెడుతున్నాయ్. చీకాకు పెట్టడమే గాకుండా, కలవరపెడుతున్నాయ్.

'బుచ్చినాయుడి అలికిడవుతేసాలు, ఒంచిననడుంఎత్తడానికి, గుండెలుండేవి గావు!ఇయ్యాల ఈళ్లు ముందు బడి బేరాల కొస్తంర్రు! ఈళ్లు తెనిగి మీరి,తెగిస్తున్నారు! ఇది బుచ్చి నాయుడికీ-మనదేశానికీ కూడా మంచిదిగాదు! ఈ ఎదవల్ని సెడ గొడుతున్న ఎదవలున్నారు! ఈళ్లు ఇయ్యాల కూలి సాలదంటున్నారు! పన్లు ఎగ్గొడుతున్నారు! రేపు ఇంకోటి సేయొచ్చు! మరోనాడు తెగించి, మరోటి సేయొచ్చు! అంచాత, ఈ ఎదవల్ని ఎగేస్తున్న ఎదవల్ని ఏరీయాల!

కాణీ కోసం ఖూనీలు చేసిన ఖూనీల కొండయ్య కొడుకే ఈ బొచ్చు బుచ్చయ్య లేదా సదరు బుచ్చి నాయుడని ఆళ్లకి తెల్దు! ఈ బుచ్చి నాయుడు అలా ఖూనీలు సేయడని కూడా ఆళ్లకి తెల్సు! నాను దేశభక్తుణ్ణి! నాను ఏంజేసినా చట్ట ప్రకారవే జేస్తాను! అది గూడా ఆళ్లకి తెల్దు! నాను ఖూనీ సేసినా చట్ట ప్రకారవే జేస్తాను గానీ మరోలా సేయనని ఒవురికీ తెల్దు!

రగతం తాగేసినా, పెదాలు కిల్లీ ఏసుగున్నట్లే వుండాలిగానీ, రగతం తావినట్లు వుండకూడదు! నాను అదే నమ్మకం మీద నడుస్తున్న మడిసిని! అది గూడా ఆళ్లకి తెల్దు గాక తెల్దు! తెల్సుకోండి ఎదవల్లారా!' అని బుచ్చినాయుడు భయంకరంగా, భీకరంగా ఆలోచిస్తున్నాడు.

ఆ భయంకర, భీకర,భీభత్సపు ఆలోచన్లలో బుచ్చినాయుడు, ముసలయ్యను చూసికూడా,ఏమి మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

అవేవీ ముసలయ్యకు అర్థంగాక, తికమకపడుతూ, బాధనడుతున్నాడు.

* * *

ఆరోజున అప్పటివరకూ, ఆకాశం నిప్పులు చెరిగింది.

నిప్పులు జల్లుతూ సూర్యుడు, అప్పుడే పడమటి కొండ మీద అడుగు పెట్టాడు. నల్లని మేఘాలు అంతలో ఆకాశమంతటా చిక్కగా అలుముకున్నాయ్. ఆ చిక్కని నల్ల మేఘాలు ఆ నల్లని ఆకాశంలో వడివడిగా పరుగెడుతున్నాయ్. గాలి పెద్దగా వీస్తోంది. ఆ గాలి చెట్ల తలల్ని పీకేస్తు జోరుజోరుగా వీస్తోంది. ఉరుములు ఉధృతంగా ఉరుముతున్నాయ్. మెరుపులు భీకరంగా మెరుస్తున్నాయ్.

వర్షం మొదలయింది. వర్షం జోరుజోరుగా కురుస్తోంది.

ప్రకృతి చీకటి చీకటిగా, వర్షం వర్షంగా, పెనుగాల్లా, భయంకరంగా, భీకరంగా, భీభత్సంగా వుంది.

ముసలయ్య ఆ పెంకుటింటి అరుగు మీద కూర్చున్నాడు. ఆ మెరుపుల వెలుతుర్లో-వాలిపోతున్న వాసపాకను చూసాడు. గిజగిజలాడుతున్న వేపచెట్టుని చూసాడు.

ఆమెరుపుల వెలుతుర్లో-గాలికి తొట్రుపడుతూ-బరువుగా అడుగులు వేసుగుంటూ-ఆవర్షంలో-పాకవేపు నడిచాడు.

పాకలోకి వెళ్లి, ఎడ్లనువిప్పి పట్టుగున్నాడు. పెనుగాలి పది ఏనుగుల బలాన్ని పుంజుకుని బలంగా వీచింది. పెద్ద ఉరుము వురిమింది. పెద్ద మెరుపు మెరిసింది. ఎడ్లు బలంగా లాక్కుని పారిపోయాయ్, ముసలయ్య బోర్లా పడిపోయాడు. అంతలో-ఫెళఫెళమని భయంకర శబ్దం చేస్తూ-ఆకాశం విరిగి పడిపోయినట్లు-వేపచెట్టు విరిగి పడిపోయింది. ఆ చెట్టు కింద ముసలయ్య చిదిగిపోయి, చచ్చిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం బుచ్చి నాయుడు పొలంలోకి వెళ్లాడు. చెట్టుకింద చచ్చిపడివున్న ముసలయ్య శవాన్ని చూసాడు. ఆవూరు వూరంతా అక్కడికి చేరింది.

'కానిసావు నచ్చినావురోరి! కుక్కసావు నచ్చినావురోరి! బుగత కోనరం బుగ్గయిపోనావురోరి! కానీ మిగల్సనేదురోరి! మాం ఏందిని బతకాల్రోరి! మాం నుయ్యో-గొయ్యో సూసుకోవాల్రోరి!' అని పెళ్లాం-బిడ్డలు ఏడ్చారు. వూరు వూరంతా కన్నీరు కార్చింది. వూళ్లు వూళ్లన్నీ అలా కన్నీరు కారుస్తూనే వున్నాయ్.

(ఆంధ్రజ్యోతి - సచిత్ర వార పత్రిక – 30-01-1970)